సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 28 । జనవరి । 2024



శ్రీవారి సేవలో..

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయాన్ని ఏపీ ఎస్పీఎఫ్ ఐజీ బీవీ రామిరెడ్డి, సీఐడీ డీఎస్పీ శివారెడ్డి సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.



పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అన్ని విభాగాలూ కిటకిటలాడాయి.



ఖైదీలకు అవగాహన

భీమవరం: భీమవరం సబ్‌జైలును రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ధనరాజు తనిఖీ చేశారు. ఉచిత న్యాయంపై ఖైదీలకు అవగాహన కల్పించారు.

న్యూస్‌రీల్

ఇదీ పెనుగొండ అభివృద్ధి



పెనుగొండలో ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుగొండ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయలతో పెనుగొండను అభివృద్ధి చేశామని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం పెనుగొండ సీహెచ్‌సీలో రూ.2.03 కోట్లతో నిర్మించిన 30 పడకల ఆస్పత్రి భవనాన్ని ఆయన ప్రారంభించారు. పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అలాగే రూ.1.25 కోట్లతో కోడిపందేలా దిబ్బ రహదారి, నగరేశ్వర స్వామి కాలనీలో రూ.80 లక్షలతో రహదారి, బాపూజీపురం, అంబేడ్కర్ కాలనీల్లో రూ.40 లక్షలతో డ్రెయినేజీ, రూ.కోట్లతో చెరుకువాడ హైస్కూల్ భవనం, రూ.4 కోట్లతో పెనుగొండ-మార్టేరు రోడ్డు, కోట్లాది రూపాయలతో సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు చేశామన్నారు. రూ.20 లక్షలతో జిలం చెరువులో రహదారి, మారేమ్మ గూడెం, దొంగగూడెం, శాంతినగర్, చిన్నంవారిపాలెంలో రోడ్లు నిర్మించామన్నారు. పెనుగొండ-దేవ రహదారిని రూ.17 కోట్లతో విస్తరిస్తున్నామని, నగరేశ్వరస్వామి ఆలయంలో రూ.కోటితో భవన నిర్మాణం, రూ.81 లక్షలతో పెద్దింట్లమ్మ ఆలయ నిర్మాణం, రూ.2 కోట్లతో కమ్యూనిటీ భవన నిర్మాణాలు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, సీహెచ్‌సీ సభ్యుడు నూలి లక్ష్మణస్వామి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓల బదిలీ

ఏలూరు(మెట్రో): ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలువురు ఎంపీడీఓలను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నుంచి తూర్పుగోదావరి జిల్లాకు.. కె.శ్రీదేవి, జీఏకేఎస్వీ జ్యోతిరెడ్డి, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వరరావు, జీఆర్ మనోజ్, కె.వాణి, ఎం.అమిలుజమా, కె.వెంకటలక్ష్మి, ఎం.మురళీకృష్ణ, సీహెచ్ త్రిశూలపామి, ఎ.శ్రీనివాస్, కేఆర్‌ఎస్ కృష్ణప్రసాద్, టి.సూర్యనారాయణమూర్తిని బదిలీ చేశారు. అలాగే కృష్ణా జిల్లాకు.. ఎస్ఎం గంగాధరరావు, సీహెచ్ పద్మావతి, ఆర్.బేబీ శ్రీలక్ష్మి, పి.శ్రీనివాస్, ఎస్.ఆశీర్వాదం, పి.శామ్యూల్, జి.విజయకుమారి, బీఎస్ఎల్ మంగాకుమారి, ఎం.విశ్వనాథ్, కె.కిరణ్‌కుమార్, జీవీఎస్ రామకృష్ణంరాజు, ఎన్.ప్రేమాన్విత, కుంజా జ్యోతిను బదిలీ చేశారు.

పేదలకు పక్కా ఆస్తి

నాడు — గతంలో ప్రభుత్వాలు ఇళ్ల లబ్ధిదారులకు డి-పట్టాలు ఇచ్చేవి. గృహ నిర్మాణ రుణం కోసం ఆ పట్టాలను హౌసింగ్ కార్పొరేషన్ తనఖా పెట్టుకునేవి. లబ్ధిదారులకు ఎలాంటి హక్కులూ ఉండేవికాదు. రూపాయి అప్పు పుట్టేది కాదు. రిజిస్ట్రేషన్‌కు వీలులేక అత్యవసర పరిస్థితుల్లో తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి.

ఇదీ మార్పు

నేడు — పదేళ్ల తర్వాత ఇంటిపై సర్వహక్కులు ఉండేలా లబ్ధిదారుల పేరిట స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్‌ను ప్రస్తుత ప్రభుత్వం అందజేయనుంది. అందుకోసం అసైన్డ్ భూముల చట్టాన్ని ప్రభుత్వం సవరించింది. పదేళ్ల తర్వాత ఇవి సేల్ డీడ్‌లుగా మారతాయి. తద్వారా లబ్ధిదారులకు సదరు ఇంటిపై సర్వహక్కులు సంక్రమిస్తాయి.

ఇంటిపై సర్వహక్కులు

- జగనన్న కాలనీల్లో స్థలాల రిజిస్ట్రేషన్
- ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం
- రేపటి నుంచి ప్రక్రియ ప్రారంభం
- సచివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థలాలు ఇచ్చి గృహనిర్మాణానికి ప్రోత్సాహం అందిస్తున్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో స్థలాలిచ్చి చరిత్రాత్మక అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. తాజాగా జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 29 నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ ప్రారంభం కానుండగా ఈ మేరకు అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.

సుమారు 1.69 లక్షల మందికి..

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కింద పశ్చిమగోదావరి జిల్లాలోని 779 లేఅవుట్లలో 70,635 మందికి, ఏలూరు జిల్లాలో 98,874 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించింది. అలాగే మరో రూ.35 వేల డ్వాక్రా రుణాన్ని మంజూరు చేసింది. రాయితీపై ఐరన్, సిమెంట్‌తో పాటు ఉచితంగా ఇసుక అందిస్తోంది. అలాగే జగనన్న కాలనీల్లో కోట్లాది రూపాయలతో తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ వసతులు కల్పిస్తోంది. దీంతో కాలనీల్లో ఇల్లు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు విలువ చేస్తాయని అంచనా.



ఆకివీడు మండలం తాళ్లకోడు జగనన్న కాలనీలో ఇళ్లు

శరవేగంగా ఏర్పాట్లు

జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమవారం నుంచి వచ్చేనెల 9లోపు పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే వీఆర్వోలు, కార్యదర్శులకు శిక్షణ పూర్తిచేసింది. జిల్లాలోని 1,165 గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల నిర్వహణకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం తరపున వీఆర్వో లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయనుండగా, కార్యదర్శులు జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. కన్వేయన్స్ డీడ్‌లో తప్పులు రాకుండా ఉండటంతో పాటు నిర్ణీత గడువు నాటికి రిజిస్ట్రేషన్లు పూర్తిచేసేలా లబ్ధిదారుని ప్లాటు నంబర్, సరిహద్దుల వివరాలను రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. శనివారం యలమంచిలి మండలంలోని పలు సచివాలయాలను ఆయన సందర్శించారు.

ప్రయోజనాలెన్నో..



యలమంచిలి సచివాలయంలో సమీక్షిస్తున్న డీఆర్వో శివన్నారాయణరెడ్డి

- స్థలం రిజిస్ట్రేషన్ ద్వారా ఇంటిపై లబ్ధిదారులకు హక్కులు సంక్రమిస్తాయి.
- ఇంటిని బ్యాంకులో తనఖా పెట్టి రుణసాయం పొందవచ్చు.
- ఇంటి విలువ పెరిగి కొనుగోలుకు డిమాండ్ ఏర్పడుతుంది.
- అత్యవసర సమయాల్లో ఇంటిని అమ్ముకునే వీలుంటుంది.
- వారసులకు గిఫ్ట్ డీడ్ కింద ఇంటిని బదలాయించవచ్చు.

పూర్తి హక్కులతో..

ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. స్థలం రిజిస్ట్రేషన్‌తో ఇళ్లపై పూర్తి హక్కులు సంక్రమించడం ద్వారా పేదవర్గాల వారికి ఎంతో మేలు జరుగుతుంది.

– బి.శివన్నారాయణరెడ్డి, డీఆర్వో, పశ్చిమగోదావరి జిల్లా

రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం చాలా ఆనందం



రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం మాది. నా భర్త, ఇద్దరు పిల్లలతో 20 ఏళ్లుగా అద్దె ఇంట్లో జీవిస్తున్నాం. ఆకివీడులో కాలువగట్టును చేర్చి రేకుల షెడ్డులో నెలకు రూ.1,500 అద్దె ఇచ్చి బతికేవాళ్లం. ఇల్లు కోసం గతంలో చాలా దరఖాస్తులు చేసినా ఫలితం లేదు. సీఎం జగన్ సార్ వచ్చిన తర్వాత స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల సాయం, రూ.35 వేల డ్వాక్రా రుణం ఇవ్వడంతో మా సొంతింటి కల సాకారమైంది. ఇప్పుడు స్థలాన్ని నా పేరున రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారని అధికారులు చెప్పడం చాలా సంతోషంగా ఉంది.

–షేక్ అమీనా, తాళ్లకోడు, ఆకివీడు మండలం

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



కొండేటి లాజరుకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

పాలకోడేరు: పాలకోడేరు మండలం కుముదవల్లికి చెందిన టీడీపీ నేత, మాల మహానాడు జిల్లా నాయకుడు కొండేటి లాజరు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. లాజరు మాలమహానాడు నాయకుడిగా కీలకంగా పనిచేస్తూ టీడీపీలో కొనసాగుతున్నారు. సీఎం జగన్ ఆశయాలు, సిద్ధాంతాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై లాజరు ఆయన అనుచరులతో వైఎస్సార్‌సీపీలో చేరారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బంధన పూర్ణచంద్రరావు, సర్పంచుల చాంబర్ మండల అధ్యక్షుడు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, పార్టీ సీనియర్ నాయకులు పిన్నమరాజు పృథ్వీరాజు, అంగరాజు సత్తిబాబు, కొండేటి ఏసురత్నం, గుమ్మళ్ల మోషేను, పోతురాజు అశోక్‌కుమార్, గోగులమండ యాకోబు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా తాడేపల్లిగూడెం డిపోను శనివారం ఆయన సందర్శించారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. యూనియన్ నాయకుల నుంచి విన్నపాలను స్వీకరించారు. ప్రతిభ చూపిన ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. డిపో అధికారులు, ఉద్యోగులు ఆయన్ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడ జోన్‌కు త్వరలో 400 ఎలక్ట్రికల్, ఇతర బస్సులు రానున్నాయని చెప్పారు. తాడేపల్లిగూడెం డిపో నుంచి త్వరలో అల్ట్రా డీలక్స్ ఎక్స్‌ప్రెస్‌లు విజయవాడకు పంపుతామని, బైపాస్, ఇతర ఎక్స్‌ప్రెస్‌లు తాడేపల్లిగూడెం డిపోలోకి వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి, డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్

ఇంటర్ ఫీజు గడువు పెంపు

భీమవరం: ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తత్కాల్ విధానం ద్వారా పరీక్ష ఫీజును ఈనెల 29 వరకు చెల్లించే అవకాశం ఉందని ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ జిల్లా అధికారి కేవీ సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం రూ.3 వేలు చెల్లించి ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.



తాడేపల్లిగూడెంలో ఆసరా కార్యక్రమానికి హాజరైన అక్కచెల్లెమ్మలు

మహిళా సాధికారతకు ఆసరా

రాష్ట్రంలో మహిళా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం స్త్రీ సాధికారతకు పెద్దపీట వేస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు రుణమాఫీ కింద సీఎం జగన్ వైఎస్సార్ ఆసరా సాయం అందిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా నాలుగో విడత ఆసరా సంబరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ప్రజాప్రతినిధులు చెక్కులు అందిస్తుండగా.. లబ్ధిదారులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. – తాడేపల్లిగూడెం అర్బన్/నరసాపురం రూరల్

సంపూర్ణ న్యాయం



తాడేపల్లిగూడెంలో మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

రాష్ట్రంలోని మహిళలందరికీ సంపూర్ణ న్యాయం చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం. మహిళా సాధికారతను సీఎం జగన్ చేతల్లో చేసి చూపించారు.

– కొట్టు సత్యనారాయణ, డిప్యూటీ సీఎం

(తాడేపల్లిగూడెంలో మున్సిపల్ పార్కులో జరిగిన ఆసరా కార్యక్రమంలో..)

రూ.72 వేల లబ్ధి



సీఎం జగన్ గత ఎన్నికల సమయంలో చెప్పినట్టుగానే డ్వాక్రా రుణమాఫీ చేశారు. నాకు ఏడాదికి రూ.18 వేల చొప్పున నాలుగు విడతల్లో రూ.72 వేల లబ్ధి చేకూరింది. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాం.

–ఎ.ప్రసన్న, 30వ వార్డు, తాడేపల్లిగూడెం

ఆర్థిక పరిపుష్టి



మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు, ఆసరా, అమ్మఒడి, సున్నావడ్డీ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సాయంతో ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నాం. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాం.

– ఈ.సత్యవతి, 3వ వార్డు, తాడేపల్లిగూడెం

మహిళా సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రంలో మహిళా సంక్షేమం, సాధికారత లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

(నరసాపురం మండలం సీతారాంపురం సౌత్ గ్రామంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



సీతారాంపురం సౌత్ గ్రామంలో ఆసరా చెక్కు అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి

కేసుల పరిష్కారంలో ఐదో స్థానం

ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి జి.రామగోపాల్



ఏలూరు (టూటౌన్): కేసుల పరిష్కార విషయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోర్టు రాష్ట్ర స్థాయిలో 5వ స్థానంలో నిలిచిందని ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి జి.రామగోపాల్ చెప్పారు. స్థానిక జిల్లా న్యాయసేవాసదన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో గత సంవత్సరం 24,309 క్రిమినల్,1301 సివిల్ కేసులు పరిష్కరించి రాష్ట్ర స్థాయిలో 5వ స్థానంలో నిలిచామన్నారు. ఈ ఏడాదిలో మార్చి 9, మే 15, సెప్టెంబర్ 14, డిసెంబర్ 14 తేదీల్లో జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తామని చెప్పారు.అలాగే ప్రజలు రహదారి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, శాశ్వత లోక్‌అదాలత్ చైపర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పెదపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. మండలంలోని సత్యవోలులో బేత దుర్గ ఫణీంద్ర అక్రమ మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్సై కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విక్రయ కేంద్రంపై దాడి చేశారు. బేత దుర్గ ఫణీంద్ర తన ఇంట్లో ఉంచిన 8 క్వార్టర్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఆకివీడు: స్థానిక అయిభీమవరం వెళ్లే రోడ్డులో శనివారం బొలేరో వాహనం ఢీకొని మోటారు మెకానిక్ నడింపల్లి సాయి చంద్(25) అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకివీడు నుంచి అయిభీమవరం వైపు వెళ్లుతున్న బొలేరో వాహనం ఎదురుగా వస్తున్న మోటారు సైకిలిస్టు చందును ఢీకొట్టడంతో అతను సంఘటనా స్థలంలో మృతి చెందాడు. దీంతో చందు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, తండ్రి సిద్ధయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగబాబు చెప్పారు.

తుపాకులు ఉంటే కేసులు తప్పవు

ముదినేపల్లి రూరల్: చెరువులపై వాలే పిట్టలను కొట్టే నెపంతో ఎవరి దగ్గరైనా నాటు తుపాకులు ఉంటే కేసులు నమోదు చేస్తామని కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై డి.వెంకట్‌కుమార్ ఆధ్వర్యంలో ఆక్వా రైతులతో సమావేశం నిర్వహించారు. ఎవరిదగ్గరైనా మందుగుండి సామగ్రి ఉంటే తీవ్ర చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా చెరువులు దగ్గర ఉండే కాపలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే మందుగుండి వాడేలా ప్రోత్సహించే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్ని ప్రాంతాల్లో సంచరించేది ఒకే పులి

దెందులూరు/ఏలూరు రూరల్/ఏలూరు (మెట్రో)/ద్వారకాతిరుమల: జిల్లాలోని బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం, దెందులూరు మండలాలతో పాటు, ద్వారకా తిరుమల మండలంలోని సత్తెన్నగూడెం, తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో సంచరించింది ఒకే పులి అని అధికారులు నిర్ధారించారు. పెద్దపులి సంచరిస్తున్న ప్రాంతాలను శనివారం అధికారులు పరిశీలించారు. ద్వారకాతిరుమల మండలంలోని సత్తెన్నగూడెంలో పులి సంచరించిన ప్రాంతాన్ని అటవీ శాఖ టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ రేంజ్ అధికారి ఎం.రంజిత్ కుమార్ పరిశీలించారు. దెందులూరు మండలంలోని పెరుగ్గూడెంలో పాదముద్రలను జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్ర దామ పరిశీలించారు. పెద్దపులి సంచారం గురించి తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 1800- 425-5909కు ఫోన్ చేయాలని సూచించారు.

క్లుప్తంగా

30, 31 తేదీల్లో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు

తణుకు: ఈనెల 30, 31 తేదీల్లో తణుకులో జరగబోవు గీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు కామన మునిస్వామి తెలిపారు. గీత కార్మికుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గీత వృత్తిని నమ్ముకున్న కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించాలని కోరారు. ఈ 15వ మహాసభల్లో అన్ని విషయాలు చర్చించి భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధమవుతామని మునిస్వామి తెలియజేశారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



ఈడూరులో స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చనలు చేసి, స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా శ్రీ కృష్ణదేవరాయల జయంతి

తణుకు టౌన్: పట్టణంలో శ్రీ కృష్ణదేవరాయల 553వ జయంతి వేడుకలను తణుకు కాపు యువత, కాపు సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం తణుకులోని వంగవీటి రంగా రోడ్డు హౌసింగ్ బోర్డులో వైఎస్సార్ పార్కు వద్ద గల శ్రీకృష్ణదేవరాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దక్షిణ భారత దేశ రాజుల్లో అగ్రగణ్యుడు శ్రీ కృష్ణదేవరాయలు అని, ఆయన సామ్రాజ్యంలో రత్నాలను వీధుల్లో రాసులుగా పోసి అమ్మేవారని చరిత్ర చెబుతున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో చిక్కాల మోహన్, బెజవాడ సూరి, ఆకుల సతీష్, ఆకుల ప్రసాద్, బడేటి సాయి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు డేటాల్ సోప్స్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం తాడేపల్లిగూడెం లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ అధ్యక్షుడు కె.రమణయ్య ఆధ్వర్యంలో దాత లంకా శ్రీనివాస్ సాయంతో సానిటరీ ప్యాడ్స్‌ను, మరో దాత మద్దూకూరి మెహర్ ప్రసాద్ సాయంతో డేటాల్ సోప్స్‌ను అందజేశారు. డాక్టర్ కేతు కమలచే విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, చర్మ వ్యాధులపై అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, చిక్కాల భ్రమరాంబికా, పడాల కావ్య రెడ్డి, రేణుక, మాధురి, అంబికా, పీఈటీ ఇంద్రవాణి, రామాంజనేయులు, రత్నకుమారి, కారుణ్య, సుబ్బారావు, మౌనిక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ సభ



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 140 నెలవారీ సభా కార్యక్రమం శనివారం రాత్రి స్థానిక గీత మందిరంలో వైభవంగా జరిగింది. సంఘ అధ్యక్షుడు సూరంపూడి వేంకట రమణ అధ్యక్షత వహించారు. జి.రామసుబ్బారావు, శేషవేణి దంపతులు, కళాకారులు జ్యోతి ప్రజ్వలన గావించారు. కోపల్లె శ్రీనివాస్ బృహన్నల ఏకపాత్రాభినయనం చేశారు. సంఘ కళాకారులు సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గుమ్ములూరి శ్రీహరికి గౌరవ సత్కారం, పీఎంపీ సంఘ నేత పోలవరపు వెంకట కృష్ణ (అత్తిలి)కి వృత్తి సేవా పురస్కారం, సీనియర్ నటి సరిదే లక్ష్మి (తణుకు)కు ఆర్థిక సత్కారం చేశారు. పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలకు ప్రభుత్వ 'ఆసరా'

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను గజమాలతో సత్కరిస్తున్న డ్వాక్రా మహిళలు

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక లక్ష్మీ ప్రియ ఎస్టేట్ మున్సిపల్ పార్కులో జగనన్న ఆసరా నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో స్వయం సహాయ సంఘాల సభ్యులకు పావలా వడ్డీ రుణాలు అందిస్తే, నేడు సీఎం జగన్ ఆసరా పథకం ద్వారా ఆర్థిక పరిపుష్టికి భరోసా కల్పిస్తున్నారని మంత్రి తెలిపారు. అక్క, చెల్లమ్మలు సంతోషంగా ఉంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నమ్మిన అన్నగా జగన్ నిలిచారన్నారు. ఒక ఆసరా, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, చేదోడు తదితర పథకాల ద్వారా అన్ని కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చెందుతున్నారని తెలిపారు. మహిళా సాధికారతను జగన్ చేసి చూపించాన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారని దేశానికి చెటిచెప్పిన వ్యక్తి జగన్ అన్నారు. ప్రజలకు మంచి చేస్తుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నాడని విమర్శించారు. చంద్రబాబు మీటింగులు ఎక్కడ నిర్వహించినా డ్వాక్రా మహిళలు రావాలని పలు ఇబ్బందులకు గురిచేసేవాడని ఆరోపించారు. డ్వాక్రా గ్రూపులకు బ్యాంకులు ఇచ్చిన రుణాలు 99.9 శాతం తిరిగి రుణాలు చెల్లించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విడతల వారీగా నేరవేరుస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం నాలుగు విడతల్లో రూ. రూ.25,57,080 వేల కోట్లు వైఎస్సార్ ఆసరా డ్వాక్రా సంఘాలకు అందించారన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన సమయంలో తాడేపల్లిగూడెంలో రౌడీయిజం, గుండాయిజం చెలరేగిపోయాయన్నారు. పట్టణ, పరిసర ప్రాంతాల మహిళలు మార్కెట్‌కు వస్తే ఎవరు ఏం చేస్తారోనని భయపడిపోయేవారన్నారు. తాను రెండు సార్లు ఓడినా మూడవ సారి గెలిచి లా అండ్ ఆర్డర్‌ను పక్కా ప్రణాళికలతో అమలు చేశామన్నారు. పట్టణంలోశాంతి భద్రలు నెలకొల్పి మహిళలకు రక్షణ కల్పించామన్నారు. గతంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని సుమారు రూ.1000 కోట్ల నిధులతో అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మరింత అభివృద్ధిని చేస్తున్నామన్నారు.

ఇచ్చిన మాట నెరవేర్చారు



ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాన్ని నాలుగు విడతలుగా అందజేశారు. వైఎస్సార్ అసరా సొమ్ము మాకు ఎంతగానో ఉపయోగపడింది. మాకు చాలా సంతోషంగా ఉంది. జగనన్న సంక్షేమ పథకాలు చాలా బాగున్నాయి. -ఎ.లత, 30వ వార్డు, తాడేపల్లిగూడెం

జగనన్నకు రుణపడి ఉంటాం



గతంలో చంద్రబాబునాయుడు రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేశాడు. జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీని తు.చ తప్పకుండా నెరవేర్చారు. వైఎస్సార్ ఆసరా నాకు చాలా ఉపయోగపడింది. జగనన్నే మళ్లీ సీఎం కావాలి. పల్లేటి నాగమణి, కోరుమిల్లి

వైఎస్సార్ ఆసరాకు సభకు ప్రభం'జనం'



వైఎస్సార్ ఆసరా సమావేశానికి భారీగా తరలి వచ్చిన డ్వాక్రా మహిళలు

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెంలో శనివారం జరిగిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలకు మహిళలు ప్రభంజనంలా తరలివచ్చారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ సభకు సుమారు 20వేల మందికి పైగా మహిళలు హాజరయ్యారు. సభ ప్రాంగణంలో అయితే ఇసుక వేస్తే రాలనంతగా మహిళలతో నిండిపోంయింది. వైఎస్సార్ ఆసరా సభకు అంచనాలకు మించి పెద్ద ఎత్తున మహిళలు తరలిరావడంతో ప్రతిపక్ష పార్టీలకు కలవరం పుట్టించింది. వైఎస్సార్ ఆసరా సభ గ్రాండ్ సక్సెస్ కావడం అందరిలోను మంచి జోష్‌ను నింపింది.

ప్రజల చెంతకే జగనన్న సంక్షేమ పాలన

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- కె ఇల్లిందలపర్రు, వేల్పూరులో కొనసాగుతున్న ప్రజాదీవెన యాత్ర



ఇరగవరం: తూర్పు విప్పర్రులో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి



తణుకు టౌన్: వేల్పూరులో ప్రజా దీవెన యాత్రలో పాల్గొన్న మంత్రి కారుమూరి

ఇరగవరం: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే సంక్షేమ పాలన తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఇరగవరం మండలంలోని కె ఇల్లిందలపర్రు, తూర్పు విప్పర్రు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజా దీవెన యాత్ర సాగింది. విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. పాదయాత్రలో దారి పొడవునా మంత్రికి మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ప్రతి ఒక్కర్నీ పలుకరిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వలంటీర్ వ్యవస్థ ద్వారా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన సమస్యలు విని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ తణుకు నియోజకవర్గన్ని 3వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ప్రజలందరూ సుఖంగా ఉన్నారని తెలిపారు. కుల, మత, ప్రాంతాలను తావులేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన చేస్తున్నారన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి, 32లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అలాగే తూర్పు విప్పర్రులో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెనుమత్స సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, కె ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, సైపురెడ్డి పెద్దిరాజు, ఎపీపీ వెలగల సాయిబాబా రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు షేక్ మాబ్, సర్పంచ్‌లు సత్యనారాయణ, కార్యదర్శి దుర్గాప్రసాద్, నాయకులు గరికి పాటి సతీష్, మామిడిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: ప్రజలకు నూరుశాతం సంక్షేమం, అభివృద్ధి జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో నిర్వహించిన ప్రజా దీవెన పాదయాత్ర, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా గ్రామస్తులను ఉద్దేశించి మంత్రి కారుమూరి మాట్లాడారు. నియోజకవర్గంలో పెద్ద గ్రామంగా వున్న వేల్పూరు గ్రామంలో రూ. 6 కోట్ల నిధులతో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే గ్రామంలోని పెత్తందార్లు, టీడీపీ నాయకులు కోర్టుకెళ్లి ఆస్పత్రి నిర్మాణాన్ని అడ్డుకున్నారని చెప్పారు. పేదలకు మెరుగైన వైద్యం అందకుండా గ్రామ టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని తెలిపారు. గత టీడీపీ పాలనలో వేల్పూరు గ్రామంలో రూ. 36 కోట్ల అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తే గత నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రూ. 158 కోట్ల విలువైన అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి సత్య రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ శెట్టి బలిజ ఆత్మ గౌరవ ప్రతిక దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాలను తణుకు నియోజకవర్గ గ్రామాల్లో రూ. 2 కోట్లతో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సొంత నిధులతో ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా వేల్పూరు గ్రామంలో నూతనంగా నిర్మించి రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ సెంటర్లను మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభించారు. అదే విధంగా వేల్పూరులోని చింతలదొడ్డిలో ఏర్పాటు చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని మంత్రి కారుమూరి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బీ భరణీ ప్రసాద్, తణుకు, అత్తిలి మండల పార్టీ అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గ ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు చిట్టూరి వెంకట సుబ్బారావు, ఉండవల్లి జానకి, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మహిళా అధ్యక్షురాలు కనక దుర్గ, వైఎస్ ఎంపీపీ శేషుకుమారి, ఎంపీటీసీ సభ్యులు చంద్రు శ్యామల, విజయ దుర్గ, వెంకట దుర్గ, సుజాత, ఏఎంసీ డైరెక్టర్ బండి పార్వతి, తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, వీఆర్‌వోలు, సిబ్బందితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడుతూ పట్టుబడిన ఏఎంసీ అసిస్టెంట్



పెదతాడేపల్లి వద్ద ఏఎంసీ అసిస్టెంట్ సత్యనారాయణ, వ్యాన్ డ్రైవర్‌ను నిలదీస్తున్న ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: మార్కెట్ కమిటి సిబ్బంది అవినీతిపై దృష్టి సారించిన ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ ఏఎంసీలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సత్యనారాయణను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంఘటన పెదతాడేపల్లి మేకల సంత వద్ద చోటు చేసుకుంది. మేకలతో వెళ్తున్న వ్యాన్ డ్రైవర్ నుంచి సత్యనారాయణ డబ్బులు తీసుకుంటుండగా ప్రత్యక్షంగా చూసి నిలదీశారు. ఏఎంసీ అసిస్టెంట్ సత్యనారాయణ, వ్యాన్ డ్రైవర్లను ప్రశ్నించారు. అవినీతికి పాల్పడిన ఉద్యోగిని సస్పెండ్ చేయాలని ఏఎంసీ గ్రేడ్-1 కార్యదర్శి ఎంవీఎస్.ప్రభాకర్‌కు చైర్మన్ సంపత్‌కుమార్ ఆదేశించారు. అవినీతిపై చర్యలు తీసుకోకపోతే ఏఎంసీ కార్యదర్శిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. దీనిపై ఏఎంసీ కార్యదర్శి ప్రభాకర్‌ను వివరణ కోరగా మేకల సంతలో ఆదాయం పక్కదారి పట్టకుండా నిరంతరం పర్యవేక్షించేలా సూపర్‌వైజర్‌ను నియమించామన్నారు. అలాగే, ఏఎంసీ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ కమిటి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవడం హర్షం వ్యక్తమవుతుంది.


విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి



బహుజన రక్షణ సంఘం సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా విద్యార్థి స్థాయి నుంచే ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని బహుజన రక్షణ సంఘం స్కాలర్స్ వాయిస్ కన్వీనర్ కొణిదెల విజయ్ అన్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో శనివారం సంఘం ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ విద్యార్థులకు వసతి గృహాల్లో నిర్వహణ, అందుతున్న సౌకర్యాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. వక్తలు మాట్లాడుతూ సంక్షేమమే లక్ష్యంగా సామాన్యుల పరిరక్షణ కొరకు నిరంతరం విద్యార్థులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగంలోని హక్కులపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బహుజన రక్షణ సంఘం అధ్యక్షుడు కొక్కిరిగడ్డ శ్యామ్, కోఆర్డినేటర్ గుంపుల సత్యకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సున్నితమైన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి



మహదేవపట్నంలో ఉచిత కంటి వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉండి: సున్నితమైన అవయవాలైన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉత్తర అమెరికా తెలుగు సంఘ ప్రతినిధులు శ్యాం మద్దాలి, ప్రేమ్ కలిదిండి అన్నారు. శనివారం మండలంలోని మహదేవపట్నంలో ఉపసర్పంచ్ ముదునూరి సుబ్బరాజు, చింతలపాటి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో రాజమండ్రి గౌతమి ఐ ఇనిస్టిట్యూట్ వారు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 200 మంది రోగులు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. అవసరమైన వారికి కళ్ళజోళ్లు, అందజేశారు.

ఆర్టీసీ డ్రైవర్లు ఏకాగ్రతతో మెలగాలి



తణుకులో ఆర్టీసీ సిబ్బంది పసుపు, కుంకుమ ఇస్తున్న వకులాదేవి, తదితరులు

తణుకు అర్బన్: ఆర్టీసీ డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది విధి నిర్వహణలో ఏకాగ్రతతో వ్యవహరించాలని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్, బోర్డు డైరెక్టర్ పెన్మెంటి మహేష్ అన్నారు. తణుకు ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా మాసోత్సవాలకు శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం అనే నానుడి ప్రజల్లో ఉందని దానిని కాపాడుకునేందుకు సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిపోలో అత్యుత్తమ సేవలందిస్తున్న గ్యారేజ్ ఇన్‌చార్జ్ గూడూరి శ్రీనివాసరావు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్‌లను సత్కరించారు. డిశంబరు నెలలో సంస్థకు అధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్‌లు ఖండవల్లి స్వప్న, ఎలిపే సునీత, పడాల వెంకటేశ్వర్లుకు ప్రశంసాపత్రాలు అందచేశారు. ముందుగా ఏపీఎస్ ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ కానుకొలను వకులాదేవి డ్రైవర్స్ కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి పసుపు, కుంకుమ, గాజులు, రవికెల క్లాత్ కిట్స్ అందచేశారు. డిపో మేనేజరు సప్పా గిరిధరకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గెల్లు ప్రసాద్, డిపో నాయకులు సిర్రా శాంసన్, బయ్యే సుబ్బారావు, తగరంపూడి శ్రీనివాసు, నూతలపాటి శ్రీనివాసు, సీనియర్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ తన్నీరు పున్నయ్య, సూపరింటెండెంట్ వెన్నా రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బల్లిపాడులో ఉచిత హోమియో వైద్య శిబిరం




ఉచిత హోమియో వైద్య శిబిరంలో బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: బల్లిపాడు ఉమర్ ఆలీషా ఆశ్రమంలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం అనుబంధ సంస్థ ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్‌ట్రస్టు చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అత్తిలి మండలం బల్లిపాడు గ్రామాన్ని దత్తత తీసుకున్న ఆకివీడుకు చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ దండు పద్మావతి సహకారంతో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఏఎస్ఆర్ హోమియోపతి కళాశాల ఆస్పత్రి వైద్య బృందం బీసీ పరీక్షలు చేశారు. శిబిరానికి హాజరైన 56 మందికి డాక్టర్ పద్మావతి ఉచితంగా హోమియో మందులను సమకూర్చారు. వైద్య శిబిరంలో పీఠం వలంటీర్లు సేవలు అందించారు.

చైతన్య ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం: భీమవరంలోని చైతన్య ఆటో యూనియన్‌కు నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు కాండ్రేకుల సూర్యనారాయణ అధ్యక్షతన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు. అధ్యక్షుడిగా చెన్నంశెట్టి శ్రీనివాసు, కార్యదర్శిగా వీరవల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బొలిశెట్టి జయకుమార్ విజయం సాధించారు. అనంతరం అధ్యక్షుడు శ్రీనివాసు మాట్లాడుతూ యూనియన్‌కు ప్రత్యేకంగా కమిటీ హాలు ఏర్పాటుకు కృషి చేస్తామని, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం పట్టణ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పంపన గోపి, కడలి హరిబాబు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉన్నత భవిష్యత్తు



మేడపాడు హైస్కూల్లో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న వెంకట్రావు

యలమంచిలి: హైస్కూల్ స్థాయి నుంచే సాంకేతిక విద్య అభ్యసించడం వల్ల ప్రతి విద్యార్థికీ ఉన్నత భవిష్యత్తు లభిస్తుందని మేడపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు అన్నారు. మేడపాడు హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన ట్యాబ్‌లను శనివారం ఆయన పంపిణీ చేసి, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యను అందుబాటులోనికి తీసుకురావడమే జగనన్న లక్ష్యమన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ మాట్లాడుతూ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దేగల వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు డి.ప్రసాద్, ఉపాధ్యాయులు మంచెం వెంకటేశ్వరరావు, ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్ అడబాల లేఖ్య సాయివేణి పాల్గొన్నారు.

ఉత్తమ ఎంఈవో-2గా జ్యోతి



జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న తాడేపల్లిగూడెం ఎంఈవో-2 జ్యోతి

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల విద్యాశాఖాధికారి-2గా పీఎంకే.జ్యోతి అవార్డును అందుకున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రమైన భీమవరంలో కలెక్టర్ పి.ప్రశాంతి ఈ అవార్డును ప్రదానం చేశారు. అలాగే విజయవాడలో హౌసింగ్ ఎండీ లక్ష్మీ షా చేతుల మీదుగా తాడేపల్లిగూడెం ఉత్తమ హౌసింగ్ ఏఈగా వైకేవీ.వెంకట్రావు అవార్డును అందుకున్నారు.